క్లుప్తంగా

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

కొయ్యూరు: సింగవరంలోని షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. భక్తులు పి.శ్రీనివాసరావు, దేవి దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. సాయిబాబా విగ్రహాన్ని పల్లకిలో గ్రామంలో ఊరేగించారు. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కళ్యాణం తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అటవీ ప్రాంతంలో మంటలు


కొండ ప్రాంతంలో చెలరేగిన మంటలు

డుంబ్రిగుడ: మండలంలోని చాపరాయి సమీప అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో చెట్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. స్థానిక అటవీ ప్రాంతంలో నీలగిరి, మామిడి, జామ, ఉసిరి చెట్లు ఎక్కువగా దగ్ధమైనట్టు స్థానికులు చెప్పారు. తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, దీంతో విలువైన అటవీ సంపద నాశనమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి నిఘా ఉంచి ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పాము కలకలం


హతమైన పాము

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట వద్ద పొలాల్లో సంచరిస్తున్న ఓ భారీ తాచుపామును అక్కడ పనులు చేస్తున్న రైతులు శుక్రవారం గమనించారు. సుమారు 8 అడుగుల పొడవు, తెల్లని రంగులో ఉన్న ఈ పామును చూసి రైతులు అవాక్కయ్యారు. రైతులు పామును హతమార్చి దహనం చేశారు. ఇంత భారీ, అరుదైన పామును చూడటం ఇదే మొదటిసారని రైతులు చెప్పారు.

పాడైన బోర్లకు మరమ్మతులు


బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కూనవరం: మండలంలోని చినార్కూరు పంచాయతీ వెంకన్నగూడెం గ్రామంలో పాడైన బోర్లకు రిపేర్ చేసి అందుబాటులో తీసుకొచ్చారు. గ్రామంలో బోర్లు పాడవడంతో తాగు నీటి ఇబ్బందిపై స్థానికులు సర్పంచ్ అభిరామ్‌కు తెలియజేశారు. సమస్యను ఎంపీపీ పాయం రంగమ్మ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. ఆమె స్పందించి తక్షణమే మరమ్మతు చేయించారు. ఎంపీపీ రంగమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బోర్ల మరమ్మతుకు గ్రామస్తులు కూడా సహకరించారని తెలిపారు.

ఘనంగా నాగదేవత జాతర

గూడెం కొత్త వీధి: మండలంలోని గూడెం కాలనీలో శుక్రవారం నాగదేవత జాతర మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. జాతర ఉత్సవం నాలుగు రోజుల పాటు జరగనున్నట్టు ఆలయ కమిటీ సభ్యుడు రిమల నాగరాజు తెలిపారు.

యువతకు వృత్తి విద్యలో శిక్షణ


అడ్డతీగల: ఆదివాసీ యువతకు వృత్తి విద్యలో భాగంగా ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్‌లో విభాగాల్లో పదిరోజుల పాటు ఉచిత శిక్షణ ఇచ్చినట్టు లయ స్వచ్ఛంద సంస్థ కో–ఆర్డినేటర్ బిల్లియ్య చెప్పారు. శిక్షణలో పాల్గొన్న 16 మందికి ఉచితంగా కిట్లు, సర్టిఫికెట్లు అందజేశామన్నారు.

శివ పూజకు వేళాయె

- నేడు మహాశివరాత్రి పర్వదినం
- ముస్తాబైన ఆలయాలు
- పూర్తయిన ఏర్పాట్లు


కురిడిలో ముస్తాబైన శివాలయం


మత్స్యగుండంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న హుకుంపేట,ఉప్ప పీహెచ్‌సీల వైద్యులు


ప్రత్యేకాలంకరణలో మత్స్యలింగేశ్వరస్వామి


అంతర్లలోని శివాలయం


గొల్లగూడెంలోని దత్తాత్రేయుడి విగ్రహం


శివకేశవ స్వామి ఆలయంలో దర్శనమిస్తున్న నాలుగు నందులు


ముస్తాబైన శివకేశవ స్వాముల గుడి


పొల్లూరులోని అటవీ ప్రాంతంలో వెలసిన శివాలయం

డుంబ్రిగుడ/జి.మాడుగుల/హుకుంపేట/చింతపల్లి/వై.రామవరం/అడ్డతీగల/వీఆర్ పురం/మోతుగూడెం: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల జాగరణ కోసం ఆలయాలు, ఉత్సవ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి శనివారం నిర్వహించనున్న నేపథ్యంలో గ్రామాల్లో జాతరలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు చేపడుతున్నారు. డుంబ్రిగుడ మండలంలోని భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయం ముస్తాబైంది. జి.మాడుగుల మండలంలోని సంతబయలు, వంతాల,బందవీధి, జన్నేరు. జి.కొత్తూరు, తోటలగరువు, గెమ్మెలి, వనభరంగిపాడు, రామలింగేశ్వర స్వామి, పోతురాజు ఆలయాలు ముస్తాబయ్యాయి. హుకుంపేట మండంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మత్స్యగుండంలో జరుగుతున్న ఉత్సవాలను ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మితోపాటు సీఐ సుధాకర్, ఎస్ఐ సతీష్, పాడేరు ఎస్ఐ రంజిత్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సుమన, ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. చింతపల్లి మండలంలోని అంతర్ల , మడిగుంట, లోతుగడ్డ గ్రామాల్లో మహాశివరాత్రి జాతరలు నిర్వహిస్తున్నారు. అడ్డతీగల మండల కేంద్రంలోని పార్వతీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయం, మోతుగూడెం మండలంలోని పొల్లూరు గ్రామంలో దుర్గా మల్లేశ్వరి ఆలయంతో పాటు, పవర్ హౌస్ దగ్గర ఉన్న అటకేశ్వర స్వామి ఆలయాలు, వీఆర్ పురం మండలంలోని వడ్డిగూడెంలోని సతీ పార్వతి రుద్రకోటేశ్వర స్వామి ఆలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి.

శివ పార్వతుల కల్యాణానికి సర్వం సిద్ధం

ఎటపాక: మండలంలోని గన్నవరం, గొల్లగూడెంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. గొల్లగూడెంలోని దత్తాత్రేయుడు ఆలయానికి 150 ఏళ్ల చరిత్ర ఉన్నట్టు స్థానికులు చెబుతారు. ఇక్కడ ప్రతిష్ఠించిన దత్తాత్రేయుడు, శివలింగం విగ్రహాలు పచ్చరంగు రాతితో చెక్కినవి. దక్షిణ భారత దేశంలోనే ఇటువంటి రాతితో చేసిన విగ్రహాలు లేవని ఇవి త్రేతాయుగంకు చెందినవని పెద్దలు చెపుతున్నారు. గన్నవరంలోని వందేళ్లకు పైగా పురాతనమైన శివాలయం వేడుకలకు ముస్తాబైంది.

500 ఏళ్ల చరిత్ర ఉన్న శివకేశవ స్వాముల ఆలయం

పెదబయలు: మండలంలోని కిముడుపల్లి గ్రామంలో పురాతన శివకేశవులు స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు సిద్ధమైంది. గ్రామంలో 500 ఏళ్ల క్రితం ఆలయం నిర్మించినట్టు పెద్దలు చెబుతారు. ఆలయం నిర్మాణం వెనుక ఉన్న కథ గ్రామంలో ప్రాచుర్యంలో ఉంది.. పూర్వం ఒక రోజు రాత్రి గ్రామస్తులందరూ నిద్రించిన సమయంలో దేవతలు గుడి నిర్మించినట్టు గ్రామ పెద్దలు చెబుతారు. ఒకే రాత్రిలో ఆలయం పూర్తయినట్టు కథ చెబుతారు. గుడి మొత్తం రాయితో నిర్మించారు. అప్పటి నుంచి గ్రామానికి చెందిన అంగనైని, కటారి, మంతిరి, కిముడు ఇంటి పేర్లు కలిగిన గిరిజనులు శివకేశవులు స్వామి ఆలయంలో వారి వంశానికి చెందిన వారే నేటి వరకు పూజార్లుగా కొనసాగుతున్నారు. శివకేశవులు స్వామి ఎదురుగా నాలుగు నందులు దర్శనమిస్తాయి. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా భక్తుల నమ్మకం.ఈ ఆలయంలో ఏటా జరిగే మహాశివరాత్రి వేడుకలకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారు. అరడకోటలో జాతర జరుగుతుంది.

రాజవొమ్మంగి: జడ్డంగి అటవీ ప్రాంతంలోని మడేరు జీవనది ఒడ్డున ఓ కొండ గుహలో స్వయంభూగా వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం మహాశివరాత్రి వేడుకలకు ముస్తాబయింది. ఇక్కడ స్వామి వారి ఊరేగింపు కోసం తొలిసారిగా భారీ రథన్ని ఏర్పాటు చేశారు. రాజవొమ్మంగి కొండపై రాజరాజేశ్వర సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంతో పాటు పలు ప్రాంతాల్లో ఆలయాల్లో పూజలు జరగనున్నాయి. శరభవరంలోని మూడేళ్ల కొకసారి నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు జాగారాలమ్మ ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

శైవక్షేత్రాల వద్ద భారీ బందోబస్తు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలంలోని జడ్డంగిలో స్వయంభూగా వెలసిన శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జున స్వామి, వంచంగిలోని పురాతన శివాలయం శ్రీకుంతీలింగేశ్వరస్వామి, రాజవొమ్మంగి కొండపై రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాల వద్ద మహాశివరాత్రి సందర్భంగా భారీ బందోబస్త్ ఏర్పాటు చేశామని సీఐ. షేక్ బాజిలాల్ అన్నారు. జడ్డంగిలోని శివరాత్రి వేడుకల ఏర్పాట్లను సీఐ షేక్ బాజిలాల్ పరిశీలించారు. భారీ బందోబస్తు ఏర్పాటుచేశామని, ఏపీఎస్పీ, ఏఎస్ఎస్. ఏఆర్ఎస్ బెటాలియన్లు, లోకల్ పోలీసులు కలిపి 66 మందిని నియమించామన్నారు. జడ్డంగి, రాజవొమ్మంగి ఎస్సైలు షరీఫ్, గోపీనరేంద్రప్రసాద్‌లు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

బండరాయి రంధ్రంలో గురమంద విశ్వనాథుడు

వై.రామవరం: మండంలోని గురమంద అటవీ ప్రాంతంలో వేంచేసియున్న విశ్వనాథుడు ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పాము పడగ ఆకారంలో ఉన్న కొండ మధ్యలో బండరాయి రంధ్రంలో ఇమిడి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. సంతానం లేని దంపతులు ఆలయ ప్రాంగణంలో ఉన్న రెండు నంది విగ్రహాలు వద్ద మహాశివరాత్రికి ముందు రాత్రి సంతానంలేని నిష్ఠతో జాగారం చేశారు. ఉదయాన్నే స్నానాలు చేసి, విశ్వనాథుడిని దర్శించుకుంటారు. నందులను ఎత్తి ఒడిలో పెట్టుకుంటే సంతానం కలుగుతుందని నమ్మకం.

కొయ్యూరు: మండల కేంద్రంలో భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలకు సిద్ధం చేశారు. పెదమాకవరంలో పురాతనమై బ్రహ్మలింగేశ్వరుడి ఆలయంలో వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాకారంతో పాటు ఏర్పాటుచేసిన పలకలను బట్టి పల్లవుల కాలంనాటి ఆలయంగా పురాణగాథ ఉంది.


పెదమాకవరంలో వెలసిన బ్రహ్మలింగేశ్వరుడు


విశ్వనాథుని ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుధాకర్, ఎస్ఐ సంతోష్ కుమార్


జడ్డండిలో మల్లికార్జున స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ షేక్ బాజీలాల్


వీఆర్ పురంలో వేడుకలకు సిద్ధమైన సతీపార్వతీ రుద్రకోటేశ్వరస్వామి ఆలయం


వై.రామవరం మండలంలో గురమంద విశ్వనాథుని శివలింగం

విద్యార్థిని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

దేవీపట్నం: ఎంతో భవిష్యత్ ఉన్న బాలిక అనారోగ్యంతో అకాల మృతి చెందడం తనను ఎంతో బాధిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆవేదన చెందారు. మండలంలోని పెనికెలపాడు గ్రామానికి చెందిన విద్యార్థిని కత్రం యమునశ్రీ దామనపల్లి ఆశ్రమ(ముసినికుంట) పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. గురువారం అనారోగ్య కారణంగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎంపీపీ కుంజం మురళీ, వైస్ ఎంపీపీ గారపాటి మురళీ శుక్రవారం గ్రామాన్ని సందర్శించి, విద్యార్థిని కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. నాయకులు సత్యనారాయణ, బాబ్జి తదితరులున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు బలోపేతం కావాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంగవరం : రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరింత బలోపేతం కావాలని నేషనల్ అగ్రీ ఫౌండేషన్ సంస్థ డైరెక్టర్ మురుగస్ అన్నారు. పెదగార్లపాడు గ్రామంలో అభిమన్య ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీఎల్) ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మునగ ఆకు పొడి తయారీ, తేనె సేకరణ, జీడి పిక్కల రవాణా, మార్కెటింగ్‌పై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నేషనల్ అగ్రీ ఫౌండేషన్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాష్, ఉద్యానవన ఆఫీసర్ రమేష్, వ్యవసాయ, ఐటీ నిపుణులు సునీల్, విజయ్ తదితరులు రైతులకు నైపుణ్యాలు వివరించారు. అభిమన్య ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ (ఎఫ్‌పీసీఎల్) సీఈవో సతీష్, చైర్మన్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగులకు అభినందనలు


సాధించిన బహుమతులతో జెన్‌కో ఉద్యోగులు

మోతుగూడెం: తిరుపతిలో ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ పేరిట ఈనెల 14. 15, 16 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాంస్కృతిక, క్రీడా పోటీల్లో మోతుగూడెం జెన్‌కో ఉద్యోగులు సత్తా చాటారు. సాంస్కృతి కార్యక్రమాల్లో భాగంగా ఐదవ గది అనే నాటికను మోతుగూడెం ఏపీ జెన్‌కో ఉద్యోగులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి తొలిస్థానంలో నిలిచారు. నాటికలో ఉత్తమ ప్రదర్శన చేసిన ఈఈ లక్ష్మీనారాయణ ఉత్తమ నటుడుగా అవార్డు గెలుచుకున్నారు. ఉత్తమ నటిగా జ్యోతికి అవార్డు లభించింది. క్రీడా పోటీల్లో పూర్ణిమ సునీత షటిల్ డబుల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. సీలేరు క్రీడాకారిణి పూర్ణిమ సింగిల్స్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. అథ్లెటిక్స్ విభాగంలో రన్నింగ్ లాంగ్ జంప్‌లో పూర్ణిమ ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. దీంతో జాతీయస్థాయిలో జరిగే క్రీడా పోటీలకు పూర్ణిమ ఎంపికైనట్టు సీలేరు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ ఆర్.సతీష్ కుమార్ తెలిపారు. పాటల పోటీల్లో మల్లూరు లక్ష్మణ్ రావు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు స్థానిక చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ , ఈఈ బాలకృష్ణ, బాబూరావు, సీలేరు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రెటరీ ఆర్.సతీష్‌కుమార్ అభినందనలు తెలిపారు

అరటిగెల అ'ధర'హో


పెద్ద అరటి గెలతో రైతు

డుంబ్రిగుడ: ఒడిశా రాష్ట్రానికి చెందిన తుబ్బ గ్రామానికి చెందిన జన్ని మొష్య అనే గిరిజన రైతు తన పెరట్లో పండిన పెద్ద అరటిగెలను శుక్రవారం అరకు వారపు సంతకు తీసుకొచ్చారు. ఈ గెలకు సుమారు మూడున్నర అడుగులకు పైగా ఉన్న ఈ గెలకు దాదాపు 250కు పైగా అరటిపండ్లు ఉన్నట్టు పలువురు చెప్పారు. ఇలాంటి నాలుగు గెలలను విక్రయించారు. ఒక్కో గెలను రూ.800 నుంచి రూ.850లకు మైదాన ప్రాంత వ్యాపారికి విక్రయించినట్టు రైతు తెలిపారు.

70 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రంపచోడవరం: మండల కేంద్రంలోని లూథరన్ చర్చి ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. శ్రీకేశవ్ ఎమర్జన్సీ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు ఈసీజీ, సుగర్ తదితర పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు డాక్టర్ శశాంక్ పరాంకుశం చెప్పారు. ఏజెన్సీలో అన్ని ప్రాంతాల్లో ఆస్పత్రి ద్వారా వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. శిబిరానికి వచ్చిన సుమారు 70 మందికి డాక్టర్లు టి.కేతన్‌కుమార్, ప్రియా మౌనిక్ పరీక్షలు చేశారన్నారు. పాస్టర్ ఎర్నెస్ట్‌బాబు, రస్కిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి: మండలంలోని కొత్తూరు, కాశీపట్నం, ఎన్.ఆర్.పురం, శివలింగపురం ప్రాంతాల్లో ఎంపీపీ శెట్టి నీలవేణి శుక్రవారం పర్యటించి, జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, గడప గడప మన ప్రభుత్వంతో గ్రామాల్లో మేలు జరుగుతుందన్నారు.అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. కొత్తూరు సర్పంచ్ సీతయ్య, వైస్ సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి సంతాపం


కె.వరలక్ష్మి (ఫైల్)

రంపచోడవరం: మండలంలోని ఆకూరు పంచాయతీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు కత్తుల వరలక్ష్మి శుక్రవారం అనారోగ్యం కారణంతో మృతి చెందారు. గత రెండు నెలలుగా రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆమె మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. సర్పంచ్ వరలక్ష్మి మృతికి ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, మండల పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, రంపచోడవరం, గెద్దాడ సర్పంచ్‌లు ఎం.బొజ్జియ్య, వి.ప్రసాద్, నాయకుడు రామకృష్ణదొర తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మిర్చి రైతులను ఆదుకోండి

ఎటపాక: నెల్లిపాక, నందిగామ ప్రాంతాల్లో పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ శుక్రవారం పర్యటించి, మిర్చి రైతులను కలిసి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘం, సీపీఎం నాయకులు కృష్ణయ్య, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, అజయ్, రాము, రామారావు తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సదుపాయాలపై అవగాహన


డిగ్రీ కాలేజీని సందర్శించిన జూనియర్ కాలేజీ విద్యార్థులు

అనంతగిరి: మా కళాశాలకు రండి సదుపాయలు, సౌకర్యాలు చూడండి చేరండి.. అంటూ జూనియర్ కళాశాల విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఓపెన్ డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆహ్వానించారు. అరకులోయలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లేబోరేటరీలు, ఇంగ్లిష్ ల్యాబ్, క్రీడా ప్రాంగణం, లైబ్రరీ, సెమినార్ హాల్, జవహర్ నాలెడ్జ్ సెంటర్‌ను స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కాలేజీలో వసతి, బోధన విధానాలు తదితర అంశాలను డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మలత, మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. సిబ్బంది తదితరులున్నారు.

రంపలో వేడుకలకు పూర్తయిన ఏర్పాట్లు


రంపలో ఉత్సవాల ఏర్పాట్లును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎఫ్ఓ నరేంధిరన్


రంపచోడవరంలో స్వామి వారి పల్లకీ సేవలో ఎస్పీ సతీష్‌కుమార్, ఏఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

- పనులు పరిశీలించిన సబ్ కలెక్టర్ శుభం బన్సల్, డీఎఫ్‌వో నరేంధిరన్

రంపచోడవరం: రంప గ్రామంలో వెలసిన భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ అన్నారు. రంపలో మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుపై డీఎఫ్ఓ నరేంధిరన్‌తో కలిసి ఆయన ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. సబ్ కలెక్టర్ బన్సల్ మాట్లాడుతూ 20వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని, ఫైర్ సర్వీస్ వాహనం అందుబాటులో ఉంచాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రంపచోడవరం గ్రామపంచాయతీ సచివాలయం నుంచి రంప గ్రామం వరకు శివరాత్రి రోజున ఆర్టీసీ బస్సు సర్వీసు ఉంటుందన్నారు. గ్రామ వలంటీర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉత్సవాల్లో విధులు నిర్వహించాలని ఆదేశించారు. జీసీసీ ద్వారా భక్తులకు పూజ సామగ్రి విక్రయించాలన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కుమార్‌బాబు, డీఎల్‌పీవో జాన్ విల్సన్, డీఈలు ఎ.వెంకటేశ్వరరావు, రాజేంద్ర రావు, డాక్టర్ సుజిత, ఫైర్ శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఊరేగింపుగా తరలివెళ్లిన ఏటా మహాశివరాత్రి ముందు రోజు రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న భ్రమరాంభిక మల్లికార్జునస్వామి వార్ల పంచలోహ విగ్రహాలను ఊరేగింపుగా రంప శివాలయానికి తరలిస్తారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎస్పీ సతీష్‌కుమార్; ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పాల్గొని స్వామి వారి పల్లకి మోశారు. విగ్రహాలను గ్రామస్తులు, మేళా, తళాలతో రంప గ్రామానికి తరలించారు.రంప శివాలయంలో శనివారం స్వామి కళ్యాణం నిర్వహిస్తారు.